

అనర్హులకు పింఛన్లు అందిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

పార్వతీపురం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : అనర్హులకు సామాజిక పింఛన్లు అందిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా గరుగుబిల్లి మండలం రావుపల్లిలో మరణించిన వారి పేరిట గత రెండేళ్లుగా వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

108 సీట్లకు 50 మందే..



సీతంపేట ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల

- సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలలో పరిస్థితిదీ
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం ఫలితం
- ఐదేళ్లూ పోస్టుల భర్తీ చేపట్టని వైనం
- రెగ్యులర్ అధ్యాపకులు లేక అవస్థలు
- డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న సిబ్బంది
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 23: సీతంపేట ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల సమస్యలతో సతమతమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పరిస్థితి దయనీయంగా మారింది. ఐదేళ్లు రెగ్యులర్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోగా.. కళాశాలలో మౌలిక వసతులపైనా దృష్టి సారించలేదు. దీంతో ఎంతో ఎన్నో ఆశలతో ఇక్కడకు వచ్చిన విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. వాస్తవంగా గిరిజన విద్యార్థుల కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సీతం పేట కేంద్రంగా పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసింది. అయితే పక్కా భవనం లేకపోవడంతో కొన్నాళ్ల పాటు సీతంపేట ఐటీఐలో ఈ కళాశాలను నిర్వహిం చారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భవనాలను నిర్మించడంతో విద్యార్థులకు అవస్థలు తప్పాయి. వసతి సమస్య తప్పింది. అప్పటి నుంచి ఇక్కడ గిరిజన విద్యార్థులతో పాటు ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన వారికి సివిల్, మెకానికల్ విభాగాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రారంభ దశలో సిబ్బంది కొరత అంత ఎక్కువగా ఉండేది కాదు. కానీ వైసీసీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీన్ మారింది. కళాశాల పరిస్థితి అధ్వానంగా మారింది. గడిచిన ఐదేళ్లలో ఎటువంటి నియామకాలు చేపట్టలేదు. దీంతో కళాశాలను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సీతంపేట ఐటీడీఏకు అతి సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలపై అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం..

సీతంపేట పాలిటెక్నికల్ కళాశాలలో రెగ్యులర్ సిబ్బంది నియామకానికి గత వైసీపీ ప్రభుత్వం చొరవ చూపలేదు. ఐదేళ్లూ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోలేదు. దీంతో అరకొర అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. మొత్తంగా ఇక్కడ 15 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండాలి. కానీ ప్రిన్సిపాల్ (ఓఎస్‌డీ)తో సహా అందరూ డిప్యుటేషన్‌పైనే కొనసాగుతున్నారు. ఈ కళాశాలలో మొత్తంగా రెండు ట్రేడుల్లో 108 వరకు సీట్లు ఉన్నాయి. 75 శాతం మేర ఎస్టీ, మిగిలిన 25 శాతం ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులకు సీట్లు కేటాయించారు. అయితే రెగ్యులర్ అధ్యాపకులు లేని కారణంగా 50 మంది విద్యార్థులు మాత్రమే విద్య నభ్యసిస్తున్నారు. వారిలో కేవలం 10మంది మాత్రమే గిరిజన విద్యార్థులు ఉండడం గమనార్హం.


వర్కషాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భర్తీ చేయాల్సిన పోస్టులు ఇవే..

- సీతంపేట పాలిటెక్నికల్ కళాశాలలో మెకానికల్ విభాగంలో హెచ్‌వోడీ , సీనియర్ లెక్చరర్, వర్క్‌షాప్ సూపరింటెండెంట్, నలుగురు అధ్యాపకులు, ఐదుగురు ఇన్‌స్ట్రక్టర్లు, ముగ్గురు అటెండర్లను నియమించాల్సి ఉంది.
- సివిల్ విభాగంలో హెచ్‌వోడీ, సీనియర్ లెక్చరర్, ఆరుగురు అధ్యాపకులు, ఏడుగురు ల్యాబ్ అటెండర్లు, జనరల్ హెడ్, ఆఫీస్ ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్ల పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలి.
- అదేవిధంగా హాస్టల్ మేనేజర్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరేసి చొప్పున కుక్‌లు, హెల్పర్లు, క్లీనర్లు, నైట్ వాచ్‌మెన్, నలుగురు స్వీపర్లను నియమించాల్సి ఉంది.
- ఇక కళాశాల ప్రాంగణం చుట్టూ గిరిజన విద్యార్థులకు రక్షణగా ప్రహరీ, పక్కా రహదారి నిర్మించాల్సి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం

కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్లు రెండు రోజులకొకరు జీఎల్ పురం, శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, ఆమదాలవలస పాలిటెక్నికల్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. సిబ్బంది లేకపోవడంతో ఇప్పటికీ ఆమదాలవలస పాలిటెక్నికల్ కళాశాల నుంచే జీతభత్యాలు తదితర ఆర్థిక లావాదేవీలు జరపాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

- రామసుధాకర్ గంగస్వామి, ఓఎస్‌డీ

ఇబ్బందులు పడుతున్నాం

సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్ విభాగంలో రెగ్యులర్ అధ్యాపకులు, సిబ్బంది లేరు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి.

- బి.సాయిశరత్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి

ఎన్నో ఆశలతో వచ్చాం

ఎన్నో ఆశలతో సీతంపేట పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చాం. బాగా చదువుకుందామనుకుంటే పూర్తిస్థాయిలో ఇక్కడ సిబ్బంది లేరు. కళాశాలకు ప్రహరీ, పక్కా రహదారి కూడా లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

- ఎం.అభి, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థి

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు

- ఆందోళనలో సీఆర్‌ఎంటీలు
- ప్రభుత్వం స్పందించాలని విన్నపం

గరుగుబిల్లి: నూతన విద్యా విధానంలో మార్పుల కారణంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపునకు శ్రీకారం చుట్టారు. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా మండలంలో ఉన్న కాంప్లెక్స్‌లను తగ్గించే ప్రయత్నాలు విద్యాశాఖాధికారులు చేపట్టారు. దీంతో సీఆర్‌ఎంటీ (క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్ల)లో ఆందోళన నెలకొంది. విధులు నుంచి తొలగిస్తారేమోనని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని 15 మండ లాల పరిధిలో గతంలో 120 మందిని సీఆర్‌ఎంటీలను నియమించారు. సమగ్ర శిక్ష విభాగంలోగత 12 ఏళ్లుగా వారు స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో పనిస్తున్నారు. ఒకవైపు ఉపాధ్యాయులుగా, మరోవైపు విద్యా కార్యక్రమాలు అమలు చేసే సిబ్బందిగా వ్యవహరిస్తున్నారు. కాగా ప్రస్తుతం 104 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ప్రతినెలా రూ. 23,500 వేతనంగా అందిస్తున్నారు. అయితే తాజాగా స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపుతో వారి సంఖ్య 75కు చేరింది. దీంతో మిగిలిన 29 మంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎవరిని ఉంచుతారో, ఎవరిని తప్పిస్తారో తెలియక టెన్షన్ పడుతున్నారు. ఒక వేళ మరో చోటకు బదిలీ చేసినా.. తక్కువ వేతనంతో ఎలా కుటుంబాలను పోషించగలని వారు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి చిరుద్యోగులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

స్కూల్ కాంప్లెక్స్‌లు కుదించాలని తీసుకున్న నిర్ణయంతో మా ఉద్యోగాలు ఉంటాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి మా సమస్యలను గుర్తించి భరోసా ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఎ.పోలినాయుడు, సీఆర్‌ఎంటీల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆందోళన చెందొద్దు

సీఆర్‌ఎంటీలు ఆందోళన చెందొద్దు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 104 కాంప్లెక్సులకు గాను 75 కాంప్లెక్సులకు ప్రతిపాదనలు పంపించాం. విలీనం చేసిన కాంప్లెక్సుల పరిధిలోని సిబ్బందికి సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం.

- జి.పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం మన్యం


రావుపల్లిలో విద్యార్థులకు బోధిస్తున్న సీఆర్‌ఎంటీ

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

సిరిపురం, సెప్టెంబరు 23 : దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా పేలుళ్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జట్టీ ఆదేశించారు. సోమవారం ఆయన ఒక ప్రక టన విడుదల చేశారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈఏడాది రేంజ్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. బాణసంచా నిల్వలు, తయారీ, విక్రయాలు జరిపే వారిపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. అనుమతి ఉన్న గోడౌన్లు, షాపులు వద్ద భద్రతా ప్రమాణాలు సరిగ్గా ఉన్నది లేనిది పరిశీలించాలని చెప్పారు. అనధికారంగా వ్యాపారాలు చేసే వారిని ముందుగా గుర్తించి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని ఆదేశించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్, సెప్టెంబరు 23: ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాలూరు ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులందరూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వారికి రోగనిర్ధారణ పరీక్షలు చేసి అనంతరం సత్వర చికిత్స అందించాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆమె వైద్యశిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపతిరావు, వేణుగోపాలరావు, అప్పారావు, లక్ష్మణ, సతీష్, బాల, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బీపీ పరీక్ష చేయించుకుంటున్న మంత్రి సంధ్యారాణి

మున్సిపల్ కమిషనర్ల నియామకం

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 23 : పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావుకు బదిలీ అయ్యింది. ఆయన సెక్రటేరియట్‌కు వెళ్లనున్నారు. ఈ ఏడాది మార్చినెలలో నిడదవోలు మున్సిపాల్టీ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఆ స్థానంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్.శాంతికుమారిని నియమించారు.

- **సాలూరు రూరల్:** సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన బుడా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. కాగా ఇంతవరకు కమిషనర్‌గా పనిచేసిన ప్రసన్నవాణి కొద్ది రోజుల కిందట బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో మేనే జర్ రాఘవాచార్యులు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిగా సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారిగా కె.సాయికృష్ణ చైతన్య నియమితులయ్యారు. సోమవారం ఆయన విధుల్లో చేరారు. గతంలో విశాఖ జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారిగా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన మన్యం జిల్లాకు వచ్చారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా రామలక్ష్మి

పార్వతీపురం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రిజిస్ట్రార్‌గా పట్నాయకుని రామలక్ష్మి నియామకమయ్యారు. ప్రస్తుతం ఆమె కాకినాడలో పనిచేస్తుండగా.. బదిలీపై మన్యం జిల్లాకు వచ్చారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

కురిసింది వాన..

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 23 : జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వాన పడడంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు వార్డుల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచింది. ఆర్టీసీ కాంప్లెక్స్, మేదర వీధి కూడలి, పాతబస్టాండ్ వద్ద ప్రధాన రహదారులన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో పాదచారులు, వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. కాగా కొన్ని రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ఈ వర్షంతో కాస్త ఊరట చెందారు.


పార్వతీపురం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

వీడీవీకేల్లో ఉత్పత్తి స్థాయి పెంచాలి

- ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 23: సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లో (వీడీవీకే) ఉత్పత్తి స్థాయిని పెంచాలని పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వెలుగు శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీడీవీకేల వారీగా లక్ష్యాలను నిర్దేశించి... వాటిని నెరవేర్చే దిశగా కృషిచేయాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అన్ని వీడీవీకేలను పరిశీలించి తమకు పూర్తి సమాచారం అంద జేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ఏపీవో చిన్నబాబు, వెలుగు ఏపీడీ ఎం.సన్యాసిరావు, డీపీఎం ఆర్‌వీ రమణ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఆడలి వ్యూ పాయింట్ సందర్శన

ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆడలి వ్యూ పాయింట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో పీవో సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హాజరుకానున్న నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. మరోవైపు సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ లోనూ ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పరిశీలనలో టీడబ్ల్యూ ఈఈ సింహాచలం, ఏఈ నాగభూషణం తదితరులు ఉన్నారు.

పీసా ఎన్నికలు వాయిదా..


షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నేటి నుంచి నిర్వహించాల్సిన పీసా ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసినట్లు పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సర్కారు ఆదేశాల మేరకు తదుపరి ఎన్నికల తేదీని మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు గమనించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

28న మన ఇళ్లు.. మన గౌరవం

పార్వతీపురం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 28న 'మన ఇళ్లు.. మన గౌరవం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. 'మన ఇళ్లు.. మన గౌరవం' కిందట ఇప్పటికే ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఒకవేళ పూర్తిచేయకపోతే రద్దవుతాయని చెప్పారు. యూనిట్ ధర రూ.1.80 లక్షలతో పాటు స్వయం సహాయక సభ్యులకు రూ.30 వేలు రుణం లభిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడానికి మండల ప్రత్యేక అధికారులు మంగళ, బుధవారాల్లో మండలాల్లో పర్యటించాలని ఆదేశించారు. 28న లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు.


మాట్లాడుతున్న కలెక్టర్



ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్

'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్ర్కీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్ర్కీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్థంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజీ', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకుముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్ర్కిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



ఇన్ ప్రోగ్రెస్

సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

నీ జతగా



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్తాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎస్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్‌ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 294 వినతులు

స్వీకరించిన కలెక్టర్ అంబేడ్కర్, జేసీ మాధవన్

కలెక్టరేట్: విజయనగరం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 294 వినతులు వచ్చాయి. వాటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్ స్వీకరించారు. ఇందులో రెవెన్యూ 227, డీఆర్‌డీఏ 24, పంచాయతీ రాజ్ 10, గృహ నిర్మాణ సంస్థ 9, ఐసీడీఎస్, విద్యా శాఖ 7, వైద్య ఆరోగ్య శాఖకు 6 వినతులు వచ్చాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ● విజయనగరం పట్టణంలోని సంతకాల బ్రిడ్జి వద్ద విశాఖపట్టణం నుంచి విజయనగరం పట్టణంలోకి ప్రవేశించే వాహనాల రద్దీ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యను అధిక మించడానికి ఎత్తు బ్రిడ్జి జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ మధ్యలో అండర్‌పాస్, ఎప్రోచ్ రోడ్డు నిర్మించాలని విజయనగరం నియోజకవర్గం టీడీపీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో మున్సిపాల్టీ నుంచి సాధారణ నిధులు నుంచి రూ.6 కోట్లు నిధులు మంజూరు చేస్తూ కౌన్సెల్ తీర్మాణం చేశారన్నారు. వెంటనే అండర్‌పాస్ నిర్మించాలని టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీ మోహన్, బి.నర్సింగరావు తదితరులు ఉన్నారు. ● వారసత్వంగా వచ్చిన భూమిని నలుగురు వారసులు ఉండగా కొంత భూమిని ఒక వ్యక్తిపేరుమీద గతంలో పని చేసిన తహసీల్దార్ ఆన్‌లైన్‌లో మార్పు చేశారు. తమభూములు వ్యవహారం కోర్టులో ఉండగా ఆన్‌లైన్‌లో తహసీల్దార్ ఏలా మార్పు చేశారో తెలియడం లేదని జామి మండలం విజినిగిరి గ్రామానికి చెందిన యడ్ల వరలక్ష్మి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించుకున్నారు. వెంటనే తహసీల్దార్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్ ● గ్రీవెన్స్‌కు 81 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 23: జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా 81 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుల పై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి.. సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 23, కుటుంబ కలహాలకు సంబంధించి 7, మోసాలకు పాల్పడినట్టుగా 17, ఇతర విషయాలకు సంబంధించి 34 ఫిర్యాదులు ఉన్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని వాటి పూర్వాపరాలను విచారణ చేసి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, యూనివర్స్, ఎస్‌బీ సీఐ లీలారావు, ఎస్ఐ వాసుదేవ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీకి అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు



రాజ్యలక్ష్మి

విజయనగరం రూరల్: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మికి 'అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ' అవార్డు లభించింది. ఈ విషయాన్ని సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సలెంటెంట్ వై.రామ్మోహన రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సిస్(సీఎస్‌సీ ఇండియా) నీతి అయోగ్ ఈ అవార్డుకి ఆమెను ఎంపిక చేసింది. ఇంజనీర్స్ డే సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పర్చువల్‌గా ఈ విషయాన్ని ప్రకటించి, ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ అందించారని తెలిపారు. ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి దార్శనికత, ఇంజనీరింగు విద్యా రంగంలో ఆమె చేసిన దీర్ఘకాలిక కృషిని ప్రశంసించారు. ఆమె నాయకత్వం భవిష్యత్తు తరాలకు ప్రేరణ నిచ్చేలా ఉందని ఆయన చెప్పారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, విశ్వవిద్యాలయం డైరక్టర్లు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, బోధనేతర సిబ్బంది విద్యార్థులు ఆమెను అభినందించారు.

మంత్రి కొండపల్లి అమెరికా పర్యటన

విజయనగరం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పది రోజుల పాటు అమెరికా పర్యటన నిమిత్తం సోమవారం రాత్రి హైదారాబాద్ నుంచి బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా, ఎంఎస్ఎంఈ, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖాలకు భాగస్వామ్య ఒప్పందాల కోసం వివిధ సమావేశాల్లో మంత్రి పాల్గొంటారు. పర్యటన ముగించుకుని వచ్చేనెల 3న ఆయన తిరిగి రాష్ట్రానికి రానున్నారని మంత్రి కార్యాలయం ఓ ప్రటనలో తెలిపింది.

దూర విద్యా కోర్సులను ప్రోత్సహించండి

కొత్తవలస: దూర విద్యాకోర్సులను ప్రోత్సహించాలని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్రపరిశీలకుడు జి.గోపీ కృష్ణ తెలిపారు. సోమవారం ఆయన కొత్తవలస జిల్లా పరిషత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరవిద్యా కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం సార్వత్రిక విద్యను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటోందన్నారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యకు దూరమై 14 సంవత్సరాలు నిండిన వారు ఖచ్చితంగా 10 వతరగతి దూర విద్యను పూర్తి చేయడానికి ప్రోత్సహించాలని తెలిపారు. పదో తరగతి చదివి పని చేసుకుంటున్న వారు ఇంటర్మీడియట్ ఒక్క సంవత్సరంలోనే ఉత్తీర్ణులు కావచ్చునని తెలిపారు. 2024-25 సంవత్సరాలకు సంబంధించి అడ్మిషన్ ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 28 వరకు అడ్మిషన్‌లకు గడువు ఉందని, 29, 30 తేదీల్లో 200 రూపాయలు అపరాధ రుసుముతో అడ్మిషన్ పొందొచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ ఈశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఎన్‌జీవో హోంలో సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత ఎన్.రమేష్‌కు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, జోగినాయుడు, ప్రవీణ్ కుమార్, శ్రీరామ మూర్తి, రమేష్, లక్ష్మణరావు, ఎల్లయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు చెకుముకి టాలెంట్ టెస్ట్

బొబ్బిలి రూరల్: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో బుధవారం 8, 9, 10 తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వ హించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు శంబంగి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం అలజంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక బొబ్బిలిశాఖ ఆధ్వర్యంలో హెచ్ఎం పి.నిర్మలాదేవి చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపికచేస్తామని, వీరు అక్టోబరు ఒకటోతేదీన జరిగే మండల స్థాయి పరీక్షకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆనెం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణదాస్ పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: బొబ్బిలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీలో పారా లీగల్ వలంటీరుగా చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదువుకున్న వారు వలంటీర్‌గా చేరవచ్చని, ఎటువంటి జీతభత్యాలు, పారితోషికం చెల్లించరని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోగా స్థానిక కోర్టులో గల మండల న్యాయసేవా కమిటీని సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్.కోటను వదలని వాన

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో సోమవారం రాత్రి 7గంటల సమయంలో భారీగా వర్షం పడింది. శనివారం నుంచీ రోజూ సాయంత్రం రోజు భారీ వర్షం కురుస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి పనుల నిమిత్తం వస్తున్న వారంతా ఇబ్బందులు పడుతున్నారు. శ్రీనివాసకాలనీ, విశాఖ-అరకు రోడ్డు జలమయమవుతుంది. దీంతో సాయంత్రమైతే స్థానికులకు భయం పట్టుకుంది. ఆదివారం రాత్రి జిల్లాలో ఎస్.కోటలో అత్యధికంగా వర్షం పడింది. 96.2 మీమీ వర్షపాతం నమోదైంది.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

వీరఘట్టం: తూడి గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో ఏవో సౌజన్య, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకుడు అభిలాష్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ చానెల్ మాజీ చైర్మన్ నమ్మక పాండురంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హుల జాబితాలు ప్రదర్శించండి: కలెక్టర్

● వర్షాల్లో ఇళ్లు దెబ్బతిన్న వారికి 25న ఖాతాల్లోకి పరిహారం

కలెక్టరేట్: జిల్లాలోని భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను సోమ, మంగళవారాల్లో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించి దీనిపై ఎవరికైనా అభ్యంత రాలుంటే వాటిని స్వీకరించి నివేదించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 66 గృహాలు దెబ్బతిన్నాయని, వాటికి పరిహారం అందించాలని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి తహసీల్దార్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు దెబ్బతిన్న వారికి ఈనెల 25న బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమ చేయనున్నామన్నారు. పంట నష్టం వివరాలకు సంబంధించి రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలన్నారు. రానున్న రెండు వారాలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్ ఆవిష్కరించారు.

భారత్‌టెక్ లీగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డైరక్టర్లు మధు, ప్రిన్సిపాల్ రోహినాఖాన్

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని ఫోర్చునిటీ పాఠశాల విద్యార్థులు భారత్ టెక్ లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు వున్న స్కూళ్లకు టెకీ బాట్ సంస్థ నిర్వహించిన భారత్ టెక్ లీగ్ పోటీలను నాలుగు అంశాల్లో మూడు స్థాయిల్లో నిర్వహించారు. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, రాష్ట్రాలకు సంబంధించిన 150 పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 22న ఏయూ కళాశాల, ఏ హబ్‌లో మూడో స్థాయి పోటీలు నిర్వహించారు. తొలి, రెండో స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఫోర్చునిటీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, శ్యామ్ మనోహర్, డి సాయి పార్థసారధి, మెహర్‌శ్రీ తరుణ్ రోబోటిక్స్ అంశంలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు, డ్రోన్ టెక్నాలజీ విభాగం ఎండీ రెహన్, బి ఉదయ్‌కుమార్, ఎం తేజ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా చైర్మన్ కేఏపీ రాజు మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులను వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టరు రోహినాఖాన్, డైరక్టర్లు మధు, అశోక్, నీలిమ అభినందించారు.

వ్యాయామ ఉపాధ్యాయుల కార్యవర్గం ఏర్పాటు



వ్యాయామ ఉపాధ్యాయుల కార్యవర్గం సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటయ్యింది. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.భీమ్ శంకరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఏపీ రెసిడెన్సీ, గిరిజన సంక్షేమం, ప్రైవేటు కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదారులుగా మంజులా వీణా (డీపీఈఓ- పార్వతీపురం), వినోద్‌బాబు (ప్రిన్సిపాల్- జీజేసీ, చీపురుపల్లి), సహాయ కార్యదర్శిగా ఉమామహేశ్వరరావు (పీడీ- బాడంగి) ను నియమించినట్లు భీమ్‌శంకర్‌రావు తెలిపారు.

వరద బాధితులకు వితరణ



బేబీనాయనకు చెక్కును అందిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడలో బొబ్బిలి పాస్టర్స్ అసోసియేషన్ తరఫున విజయవాడ వరద బాధితులకు రూ. 20,000 ఎమ్మెల్యే ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)కు ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్ముంనాయుడు పాల్గొన్నారు.

ఈ లాటరీ ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపు

కలెక్టరేట్: డెంకాడ మండలం రఘుమండ వద్ద వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లే అవుట్‌లో మిగిలిన 44ఎంఐజీ ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఈ-లాటరీ ప్రక్రియను నిర్వహించారు. జేసీ సేతుమాధవన్, డీఆర్వో అనిత సమక్షంలో కంప్యూటర్ ద్వారా లాటరీ నిర్వహించి స్థలాలను కేటాయించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు సదుపాయం కోసం జిల్లాలోని రఘుమండ, జియ్యన్నవలస, చీపురుపల్లిలో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్ లేఅవుట్లను వీఎంఆర్‌డీఏ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశామన్నారు.

ధర్మవరం గ్రామానికి తప్పిన పెనుముప్పు

● కొమటిచెరువుకు గండి ● ఉదయమే పూడ్చిన రైతులు



గండిపడిన ప్రాంతాన్ని రైతులతో కలిసి పరిశీలిస్తున్న సుధారాజు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి సోమవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులోకి అధికంగా నీరు చేరడంతో గండి పడింది. ఇది ఉదయం 7 గంటల సమయంలో మొదలు కావడంతో అటుగా వెళ్లిన రైతులు ఈ విపత్తును గమనించి గ్రామస్థులకు సమచారం ఇచ్చారు. వెంటనే వారు ఈ గండిని ఇసుక బస్తాలు వేసి పూడ్చారు. ఆలస్యంగా చూసి ఉంటే గ్రామం ముంపునకు గురయ్యేదని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు ముంపు తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ధర్మవరం చెరువు గండి ప్రాంతానికి చేరుకున్నారు. గండిని నిరోధించిన రైతులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోమటిచెరువు విస్తీర్ణం 33 ఎకరాలు కాగా చాలా వరకు ఆక్రమణలు జరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెట్టి ఆక్రమణలు తొలగించాలని కోరుతామన్నారు. అయితే వర్షాలు ఉధృతంగా పడుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎవ్వరు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీపీ సోమేశ్వర రావు, సర్పంచ్ సన్యాసయ్య, ఈవో రంగారావు, క్షేత్రసహాయకుడు పెంట దేముడు బాబు ఆయకట్టు రైతులు ఉన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ అరుణకుమారికు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ, రైతులు

శృంగవరపుకోట: శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని తహ సీల్దార్ అరుణకుమారికి వినతి పత్రం అందించారు. రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రమణ, కె. రామారావు తదితరులున్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ పోటీలు



ఖో- ఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం టౌన్: విజయనగరం పట్టణ శివారు విజ్జీ మైదానంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్- 14, అండర్- 17 విభాగాల్లో ఖో- ఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మురళి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సీతారామరాజు, తౌడుబాబు, పీడీలు రామకృష్ణ, వాణి, రవి, ప్రవీణ్, శేఖర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తా

గరుగుబిల్లి: పోలినాయుడువలసలో ఇనాం భూముల సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. సోమవారం గొట్టివలసలో పర్యటించిన ఆమెకు పలువురు రైతులు తమ సమస్యను వివరించారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తంనాయుడు సాగు చేసుకుంటున్న భూములకు పలు రకాల ఇబ్బందులు నెలకొన్నాయని, దీని కారణంగా ఈ-క్రాప్ చేయలేని స్థితిలో ఉన్నారన్నారు. అలాగే 1బీలు రావడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీఇచ్చారు. పోలినాయుడువలసకు చెందిన గంటా మధుసూదనరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి పై చర్చ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఈస్టుకోస్టు రైల్వే వాల్తేరు డివిజన్ పరిధిలో సోమవారం విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో డివిజనల్ కమిటీ సమావేశం జరిగింది.. కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డివిజనల్ జనరల్ మేనేజరు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

70 పీహెచ్‌సీల్లో నిలిచిన వైద్యసేవలు

● ఓపీలు చూడటం మానేసిన పీహెచ్‌సీల వైద్యులు

● 104 సేవల్లో కానరాని వైద్యులు

శృంగరపుకోట రూరల్: జిల్లాలో వున్న 70 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 150కి మంది వైద్యులు తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గడిచిన పదిరోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీల్లో, 104 వైద్యసేవల్లో వీరు కనీసం కనిపించడం లేదు. కేవలం అత్యవసర వైద్యసేవలకు మాత్రమే హాజరవుతున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో వీరు ఓపీ చూడటం మానేయడంతో ఆక్కడ ఉన్న స్టాఫ్‌నర్స్‌లే వైద్యుల అవతారం ఎత్తి గ్రామీణులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు విధులకు రాకపోవడంతో ఆర్ఎంపీలు పండగ చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆర్ఎంపీలకు, పీఎంపీలకు డిమాండ్ పెరిగింది. వైద్యులు ముఖ్యంగా పలు డిమాండ్లతో పాటు వైద్యశాఖలో వేగవంతంగా ప్రమోషన్లు ఇవ్వాలనీ, 20 ఏళ్లనుంచి ప్రమోషన్లు లేవని తమకు కుడా ఆరేళ్లకు ఒక సారి కేడర్ పెంచాలని.. ఇలా 12,18 ఏళ్లకు ఇవ్వాలనీ తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు.



ధర్మవరంలో వైద్యులు లేకుండానే 104సేవలు, కొట్టాం పీహెచ్‌సీలో వైద్యురాలిగా మారి సేవలు అందిస్తున్న స్టాఫ్‌నర్స్

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



శ్రీధర్ (ఫైల్)

కురుపాం: దాడి ఘటనలో గాయపడిన ఓ యువకుడు సోమవారం తెల్లవారుజామున ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కురుపాం పోలీసులు సోమవా రం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం గ్రామం గౌడువీధికి చెందిన గౌడు శ్రీధర్(23) ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన మరో యువకుడు వ్యక్తిగత కక్షలతో దాడి చేశాడు. ఈ దాడిలో గాయాలపాలైన శ్రీధర్‌ను కుటుంబీకులు ఆస్ప త్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు. అయి తే విశాఖా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీధర్ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధు వులకు అప్పగించారు. శ్రీధర్‌కు ఏడాది వయసున్న పాప ఉంది. భార్య ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి.

చికిత్స పొందుతూ యువకుడు..



సురేష్ (ఫైల్)

శృంగవరపుకోట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొట్టాం గ్రామం వద్ద శనివారం ఉదయం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కొట్టం నుంచి ధర్మవరం వైపు వస్తున్న ఆదిరెడ్డి సురేష్(33) తీవ్రంగా గాయపడ డంతో చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించాడు. మృతుడి స్వగ్రామం సన్యాసయ్యపాలెం కాగా కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారంతా రోడ్డున పడ్డారని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. ఎస్ఐ భాస్కరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలోపడి వృద్ధుడు..



దేముడు (ఫైల్)

జామి: నదిలో ఇసుకకోసం తీసిన గోతుల్లో ప్రమాదవశాత్తు చిక్కుకుని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, ఏఎస్ఐ నరసింగరావు, తహసీల్దార్ కృష్ణలత తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. జామి గ్రామానికి చెందిన కొత్తలి దేముడు(64) గేదెలను కడిగేందుకు ఆదివారం సాయంత్రం గోస్తనీనదిలోకి దిగాడు. అయితే ఈ గేదెలు నది అవతలి భా గానికి వెళ్లడంతో వాటిని తీసుకురావడానికి నదిగుండా అవ తలి వైపునకు వెళ్తుండగా నది మధ్యలో ఇసుక సేకరణ కోసం తీసిన గోతుల్లో చిక్కుకుని మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీస్, అ గ్నిమాపకశాఖలతో పాటు మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ప్రత్యేకంగా మను షులను ఏర్పాటు చేయించి మృతదేహం కోసం గాలించారు. సోమవారం సా యంత్రం మృతదేహాన్ని నదిలో గుర్తించారు. కేసును ఏఎస్ఐ నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

డెంకాడ: డెంకాడ మండలంలోని నాతవలస వద్ద గల టోల్ ప్లాజా సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం నాతవలస టోల్‌ప్లాజా దగ్గర ఎన్‌హెచ్ 26 రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి(బిచ్చగాడు) ఢీ కొనడంతో ఘటనా స్థలంవద్దే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కేంద్రాసుపత్రికి తరలించినట్లు, కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడి ఒకరు..

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలసకు చెందిన టొంపలి సూర్యనారాయణ(50) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కుటుంబ తగాదాల వల్ల సూర్యనారాయణ మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో మనస్థాపం చెంది ఈనెల 22న గడ్డి మందు తాగాడు. దీంతో హుటాహుటిన బంధువులు బాడంగి పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి కుమార్తె సాయిలక్ష్మి, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

గోడ కూలి గిరిజనుడికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని మూలశెలగాం గ్రామానికి చెందిన గిరిజనుడు కారంగి లక్ష్మణరావుకు సోమవారం మట్టిగోడ కూలడంతో తీవ్రంగా గాయపడ్డాడని పోలీసుల తెలిపారు. ఉదయం టీ తాగుతుండగా ఒక్కసారిగా గోడ కూలడంతో తలపై తీవ్ర గాయాలుకావడంతో బాడంగి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణ రావు కూలిపనిచేస్తూ జీవిస్తున్నాడు.

43 మద్యం సీసాల స్వాధీనం

బాడంగి: మల్లంపేట చెరువు వద్ద 43 మద్యం సీసాలను బొత్సవానివలసకు చెందిన సత్యనారాయణ నుంచి సోమవారం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

జి.సిగడాం: ఉపాధి కోసం వసల వెళ్లిన యువకుడు రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద చాయంలో అలముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలం అనందపురం గ్రామానికి చెందిన డొప్ప ధనుంజయరావు (26) గుంటూరులోని ఓ కోల్డ్ స్టోరేజ్ (మిర్చియార్డ్)లో పని చేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ధనుంజరావు.. తిరిగి గుంటూరు వెళ్లేందుకు ఆదివారం ఉదయం చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమం లో నెల్లిమర్ల చెంపావతి వంతెన వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని ధనుంజ యరావుతోపాటు ఉపాధికి వెళ్తున్న అదే గ్రామానికి చెందిన పోతురాజు నారాయణ రావు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటీనా ఘటనా స్థలానికి చేరుకుని రోదిస్తున్నారు. ధనుంజయరావుకు భార్య మంగమ్మ, ఇద్దరు పిల్లలు రెండేళ్ల పాప నిచిత, ఆరు నెలల బాబు విరాట్ ఉన్నారు. ఆమదాలవలస జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. అనంతరం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోక్సో కేసులో యువకుడికి 20ఏళ్ల జైలు

పూసపాటిరేగ: మండలంలోని పెదపతివాడ గ్రామానికి చెందిన కలిశెట్టి ఉమా మహేశ్వరరావు(23)కి పోక్సో కేసులో 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.7వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2023 సంవత్సరంలో ఉమామహేశ్వరరావు ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడగా, బాధితురాలి తల్లి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి కాగా, దీనిపై సోమవారం విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు న్యాయాధికారిణి కె.నాగమణి నిందితుడికి శిక్షను విధించారు.

రాజముద్రతో పాసు పుస్తకాలు అందిస్తాం

- మంత్రి సంధ్యారాణి
- కొనసాగుతున్న 'ఇది మంచి ప్రభుత్వం'

పాచిపెంట: గత ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి ఫొటోలతో రైతులకు పాసు పుస్తకాలు మంజూరు చేసిందని, కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా రాజముద్రతో పాసు పుస్తకాలు మంజూరుకు సిద్ధపడిందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని పాంచాళిలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజా వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మీ సొంత ఆస్తులపై సైకో జగన్ ఫొటో వేయడం విడ్డూరంగా ఉందన్నారు. పంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించి నేరుగా సర్పంచ్‌ల అకౌంట్లలోనే నిధులు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన, టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు, పాంచాలి సర్పంచ్ గూడేపు యుగంధర్, నాయకులు ముఖి సూర్యానారాయణ, కొత్తల పోలినాయుడు, కోరిపల్లి సురేష్, కనకబాబు పాల్గొన్నారు. ● పాంచాళిలో మంత్రికి ఘన స్వాగతం లభించింది. క్రేన్ సహాయంతో గజమాల వేసి స్వాగతించారు. ముందుగా ఆమె బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పాంచాళిలో ఎన్‌ఆర్‌జీఎస్ కింద రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. సచివాలయం ఆవరణలో ఆమె మొక్క నాటారు. ● విజయవాడ వరద బాధితుల సహాయార్థం పాంచాళి హైస్కూల్ విద్యార్థులు మంత్రి సంధ్యారాణికి రూ.7వేలను అందజేశారు. ఆమె వారిని అభినందించారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ ఫలాలు: జగదీశ్వరి

గరుగుబిల్లి: సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటకే అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గొట్టివలసలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించి, స్టిక్కర్లు అతికించారు. పార్టీ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, మర్రాపు పురుషోత్తంనాయుడు, అక్కేన మధుసూదనరావు ప్రసంగించారు. ఎంపీడీవో జి.పైడితల్లి, డీటీ పి.సత్యలక్ష్మికుమార్, సర్పంచ్ బి.చంద్రినాయుడు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఎంతో చేశాం: జయకృష్ణ

వీరఘట్టం: తూడి గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరమణ, ఏవో సౌజన్య, ఏపీఎం శివున్నాయుడు, ఏపీవో సత్యంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, తోటపల్లి మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణమూర్తినాయుడు, చింతా ఉమా, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పాచిపెంట: మంత్రి సంధ్యారాణికి గజమాలతో స్వాగతం

పేదలకు మంచి చేయడమే లక్ష్యం: విజయచంద్ర

పార్వతీపురం రూరల్: పేదలకు మంచి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. నర్సిపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నర్సిపురం గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, గొట్టాపు వెంకటరమణ, జనసేన నాయకుడు ఆగూరు మణి తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: స్టిక్కర్లు అతికిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



వీరఘట్టం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ



పార్వతీపురం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, కార్యక్రమాల నిర్వహణపై మార్గదర్శకాలు, సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్య సాధన కోసం ప్రతిఒక్కరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. స్వర్ణాంధ్రలో క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అధికారులు, ఉపాధ్యాయులు అభిప్రాయ సేకరణలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీర్ ఓ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం రూరల్: మండలంలోని కృష్ణపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘంలో గతంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకుడు తురుపాడు గణేష్ తదితరులు ఎమ్మెల్యే విజయచంద్రకు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్‌లో రూ.60లక్షలు రుణమాఫీకి మంజూరైతే ఆ సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమ చేయలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోకపోతే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానని జిల్లా సహకార సంఘం సీఈవో ఉమామహేశ్వరరావుకు ఆదేశించారు.

రైతులకు పెట్టుబడి సొమ్ము అందించండి

సీతానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మంనాయుడు, కౌలు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ధరల స్థిరీకరణ, పంట నష్టం బీమా, అన్నదాత పంట పెట్టుబడి రూ.20వేలు తక్షణమే అందించాలని కోరారు. రైతులకు కళాసీ చార్జీలు, రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని, జీవో నెం.22 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బెలగాం: పార్వతీపురం పట్టణంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, ప్రభుత్వాలు మారినా నీరు రంగు మారడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీహోంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. పార్వతీపురం పట్టణంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం చేయలేదని అన్నారు. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తాగునీటి ఇక్కట్లు తీరలేదని, వెంటనే స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆమె కోరారు. తాగునీటి సమస్య పరిష్కారం చేయకపోతే అక్టోబరు 1న చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు వెంకటరమణ, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు

పాలకొండ: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సఫైమిత్ర సురక్ష షివిర్ పేరిట సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయ కల్యాణ మండపంలో పారిశుధ్య కార్మికులు, నగర పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 96 మంది వైద్యసేవలు వినియోగించుకున్నారు. అనంతరం నగర పంచాయతీ కోసం 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన ప్రత్యేక వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్, గండి రామినాయుడు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **కురుపాం:** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సోమవారం కురుపాం సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డా.శోభరాణి ఆరోగ్య సేవలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఈవోపీఆర్డీ రమేష్‌బాబు, పంచాయతీ ఈవో కె.చంద్రశేఖరరావు, మండలంలోగల సచివాలయంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

కల్యాణసింగుపూర్‌లో వినతుల స్వీకరణ

రాయగడ: కల్యాణసింగుపూర్ సమితిలో కలెక్టర్ పారుల్ పట్వార్ అధ్యక్షతన సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 318 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్.. త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ,జడ్పీ కార్యనిర్వాహణాధికారి నిహర్‌రంజన్ కహరో, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

రాయగడ: సంప్రదాయాలను కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రొయిత్ అన్నారు. సోమవారం స్థానిక పురపాలక టౌన్ హాలులో ఒడిశా వాసుల నువాఖాయి పండగను ఘనంగా నిర్వహించారు. నువాఖయి కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ మేలనిధి బాగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ విద్యావేత్త దుష్మంత్ మహంతి, హరిహర ఖమారి, జిల్లా పౌరసంబంధాల అధికారి బసంతకుమార్ ప్రధాన్, సహదేవ్ కిసాన్ తదితరులు పాల్గొన్నారు.



నువాఖాయి నృతరూపకం ప్రదర్శిస్తున్న దృశ్యం

ఒడిశా

భూమాతను కాపాడుకుందాం

రాయగడ: భూమాతను కాపాడుకుందామని ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. సోమవారం స్థానిక ప్రేమపహడ్ వద్ద వాతావరణ పంచాయతీ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రెండు నెలలకు ఒక మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు ప్రసన్న కుమార్ గంతాయత్, అటవీ శాఖ రేంజర్ కామేశ్వర్ ప్రధాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసనల వెల్లువ

- కలెక్టరేట్ వద్ద వివిధ సమస్యలపై ఆందోళనలు

బెలగాం: కలెక్టరేట్ వద్ద సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా నిరసనలు వెల్లువెత్తాయి. పాచిపెంట మండలం కుడుమూరు గిరిజనులు తాము సాగు చేసుకుంటున్న భూములకు సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని నిరసన చేపట్టారు. తరతరాలుగా సాగుచేసుకుంటున్న గిరిజనులు, పేదలను బెదిరించి భూములు తీసుకోవాలని చూస్తున్న పెత్తందారులపై చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరారు. ● ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న మహిళలకు భద్రత కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళలు పనిచేసిన ప్రదేశాల్లో కమిటీలు వేసి సమావేశాలు నిర్వహించాలని సీఐటీయూ నాయకురాలు వి.ఇందిర డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలోని జరిగిన సంఘనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ● తమకు న్యాయం చేయాలని వలంటీర్లు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ● జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని, సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించాలని మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు



సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళల నిరసన

జీతాలు ఇప్పించండి మహాప్రభో

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో సవర భాషా వలంటీర్లుగా పనిచేస్తున్న తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని భాషా వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను వివరించేందుకు సోమవారం వారు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో పీవో యశ్వంత్‌కుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- ఎస్పీ, ఐటీడీఏ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బెలగాం: సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పరిష్కార వేదికకు 15 ఫిర్యాదులు అందినట్టు ఆయన తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కువగా అధిక వడ్డీలు, కుటుంబ తగాదాలు, ఆన్‌లైన్ మోసాలు, భూ సమస్యలపై, తదితర సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ జీడీ బాబు, ఎస్ఐ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

● **సీతంపేట రూరల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గిరిజనుల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. ఇళ్ల మంజూరు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, సోలార్ వ్యవసాయ బోరు మంజూరు చేయాలని, నూర్పుడి యంత్రం ఇప్పించాలని, పవర్ వీడర్ మంజూరు చేయాలని, గిరిజన గ్రామానికి రక్షణ గోడ నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గిరిజనులు పీవోని కోరారు. మొత్తం 87 వినతులు వచ్చాయి. ఈ వేదికలో ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నదొర, టీడబ్ల్యూ ఈఈ సింహాచలం, పీహెచ్‌వో వెంకట గణేష్ పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.





బెలగాం: సమస్యలు వింటున్న ఎస్పీ, సీతంపేట రూరల్: వినతులు స్వీకరిస్తున్న పీవో

సత్తా చాటిన అక్కా తమ్ముడు

- జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

పాలకొండ: పట్టణంలోని పెదకాపు వీధికి చెందిన గార తిరుపతిరావు, చిన్నమ్మడుల కుమారుడు, కుమార్తె సునీల్, లలిత జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు వచ్చే నెల 6 నుంచి 13వ తేదీల్లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోచ్ రామకృష్ణ, బంధువులు ఆ అక్కా తమ్ముళ్లను సోమవారం అభినందించారు.



పతకాలతో లలిత, సునీల్

చినుకు పడితే చిత్తడే

మక్కువ: స్థానిక ప్రధాన రహదారి జంక్షన్‌లో వర్షం కురిస్తే చిత్తడిగా మారుతోంది. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వరదనీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీనికి తోడు కూరగాయల వ్యాపారులు వ్యర్థాలను పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.



చిత్తడిగా మారిన రోడ్డు

రిమాండ్ ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు

పాలకొండ: స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ జోగులుతో పాటు సిబ్బందికి, రిమాండ్ ఖైదీలకు హెచ్‌ఐవీ, టీబీ హెపటైటిస్-బి పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.దివ్యప్రియ, హెడ్ వార్డర్ పి.చంద్రరావు, సిబ్బంది, ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన దళిత సంఘ నాయకులు

పాలకొండ: డీఎస్పీ ఎం.రాంబాబును జిల్లా దళిత సంఘ నాయకులు సోమవారం కలిశారు. డీఎస్పీ చాంబర్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీల సమస్యలపై డీఎస్పీకి వివరించారు. డీఎస్పీని కలిసిన వారిలో బత్తిన మోహన్, రాయి రామకృష్ణ, అంపిలి శంకరరావు, పొట్నూరు రమేష్, రాజ్‌కుమార్, బొమ్మాళి సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో సోమవారం నీటి ప్రవాహం నిలకడగా ఉంది. పైనుంచి ప్రాజెక్టులోకి 1900 క్యూసెక్కుల మేర ప్రవాహం చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 104 మీటర్ల నీటి సామర్థ్యం ఉంది. అలాగే 2.534 టీఎంసీలకు గాను 1.897 టీఎంల నీరు ఉంది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1,420 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అల్ప పీడనం కారణంగా సోమవారం కొంతమేర వర్షం కురుస్తోంది. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రాజెక్టు ప్రాంతంలో ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

గరుగుబిల్లి: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తోటపల్లికి చెందిన రొక్కం రామారావు కుమారుడు వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. ఆమెతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు ఉన్నారు.

జీవామృతంలో పోషకాలు వృద్ధి

సాలూరు రూరల్: జీవామృతం వినియోగిస్తే భూమిలో పోషకాలు వృద్ధి చెందుతాయని ప్రకృతి వ్యవసాయం సాలూరు డివిజన్ మాస్టర్ ట్రైనీ యశోదమ్మ అన్నారు. మామిడిపల్లిలో సువ్వాడ గణేష్‌కు చెందిన పంట భూమిలో సోమవారం ద్రవ జీవామృతాన్ని వేశారు. ప్రకృతి వ్యవసాయ ఎంటీ శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదికి తాళం

- వర్షం పడితే చిత్తడి
- నాడు-నేడు పనులపై అసంతృప్తి

జియ్యమ్మవలస: బీజే పురం జడ్పీ ఉన్నత పాఠశాలకు గతంలో నాడు-నేడు కింద ఆధునీకరణకు లక్షలాది రూపాయలు మంజూరయ్యాయి. పనులు పూర్తిచేశారు. కానీ వర్షం పడితే ఒక తరగతి గది మాత్రం పూర్తిగా చిత్తడి చిత్తడి మారుతోంది. దీంతో ఉపాధ్యాయులు ఆ తరగతి గదికి ఎప్పటికప్పుడే తాళాలు వేసేస్తున్నారు. అప్పట్లో నాడు-నేడు పనులను ఎలా పర్యవేక్షించారో మరి అని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



మూతపడిన తరగతి గది

అంతర్ పంటలతో అదనపు ఆదాయం

గుమ్మలక్ష్మీపురం: జీడి తోటల్లో అంతర పంటలతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని గుమ్మలక్ష్మీపురం ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ కోఆర్డినేటర్ కె.భూషణ్ తెలిపారు. సోమవారం ఎస్‌కేపాడు కాలనీలో కద్రక సన్నాయి అనే రైతుతో జీడి మామిడితోటలో అంతర పంటలపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ సుందరరావు, దాశరధి, ఐసీఆర్పీ దీప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆర్‌ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో నాలుగో విడతలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, మోటార్ మెకానిక్, కోపావెల్డర్, డ్రెస్ మేకింగ్ సీట్లకు ఈనెల 26లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్లు వెరిఫికేషన్, 28న కౌన్సిలింగ్ ఉంటుందని వివరించారు.

జియ్యమ్మవలస ఎంపీడీవో బదిలీ

జియ్యమ్మవలస: ఎంపీడీవో పి.శ్రీనివాసరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు తాడేపల్లి కమిషనరేట్ నుంచి ఆదివారం సాయంత్రం ఎంపీడీవోకు ఆదేశాలు అందాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఏ మండలానికి అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

జీవో 85ను రద్దు చేయాలి

సాలూరు రూరల్: జీవో 85ను రద్దు చేయాలని సాలూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు కోరారు. ఈ మేరకు సోమవారం సాలూరు ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన మంత్రి సంధ్యారాణికి వారు వినతిపత్రం అందజేశారు. జూనియర్ వైద్యులకు న్యాయం చేస్తానని ఆమె హామీఇచ్చారు.

పరిశుభ్రతే పరమాత్మ

సాలూరు రూరల్: పరిశుభ్రతే పరమాత్మ అని నీడ్ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాచిపెంట వేణుగోపాలరావు అన్నారు. సాలూరు వైటీసీలో నిర్వహిస్తున్న గర్భిణుల వసతి గృహంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. వైటీసీ మేనేజర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డీఈగా చాణిక్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరిలో ఉన్న గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చాణిక్యను నియమిస్తూ గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ చీఫ్ శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి డీఈగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు.

భామినిలో వర్షం

భామిని: మండలంలో గత మూడు రోజులుగా మధ్యాహ్న సమయంలో వర్షం కురుస్తోంది. సోమవారం కూడా మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొన సాగింది. పత్తి, మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.



